క్లుప్తంగా

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ వైష్ణవ సేవా సంఘం క్యాలెండర్లను గురువారం ఖమ్మంలో మంత్రి అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వైష్ణవ సేవా సంఘం అధ్యక్షుడు ఎస్‌బీ రఘునాథాచార్యులు, ప్రధాక్యాలెండర్ల ఆవిష్కరణన కార్యదర్శి కె.రవికిరణాచార్యులు, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎం.భార్గవాచార్యులు, ఎన్‌సీ పాండురంగాచార్యులు పాల్గొన్నారు.

పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: దళిత న్యాయవాద దంపతులపై దాడికి నిరసనగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం నెహ్రూనగర్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వంచ రామారావు, గుంతేటి వీరభద్రం, లిక్కి కృష్ణారావు, భద్రూనాయక్, కొరిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూలీ బంధు ప్రకటించాలి

నేలకొండపల్లి: వ్యవసాయ కూలీలకు కూలీ బంధు ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రావెళ్ల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలైన వారందరికి కూలీ బంధు ప్రకటించాలని, ఉపాధి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రతీ కుటుంబానికి 10 కేజీల బియ్యం ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, ఖాజాబీ, సైదులు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఐక్యవేదికలను రద్దు చేస్తూ ఖమ్మం జిల్లా కార్యవర్గాన్ని ఖమ్మం ఐఎంఏ హాల్‌లో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రావుల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా నర్ల శ్రీనివాసరావు, జిల్లా యువత అధ్యక్షుడిగా పుణ్యబోయినశ్రావణ్, కార్యదర్శిగా లింగబోయిన సతీష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పిట్టల వెంకటనర్సయ్య, కాశబోయిన అనంతరాములు, పతానపు వెంకటేశ్వర్లు, పిట్టల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్ పోటీలను గురువారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతనాపు నాగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు

నేలకొండపల్లి: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనకు సంబంధించి పోలీసు కేసు నమోదైంది. మండలంలోని అనాసాగారానికి చెందిన బొడ్డు వెంకట్‌కిరణ్, తన భార్య, కుమారుడితో ఈనెల 1న బైక్‌పై గురుకులం వద్దకు వెళ్తుండగా కోనాయిగూడెం సమీపాన జాతీయ రహదారి పనులు చేస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడగా, గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో టిప్పర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కవి 'అలిశెట్టి' యాదిలో..

ఖమ్మంగాంధీచౌక్: నవీన సాహిత్య గమనానికి కేంద్రకం అలిశెట్టి ప్రభాకర్ అని కవి, రచయిత అన్వర్ అన్నారు. గురువారం స్థానిక గట్టయ్య సెంటర్‌లోని టెండర్ రూట్స్ పాఠశాలలో అలిశెట్టి ప్రభాకర్ యాదిలో(జయంతి) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవి అన్వర్ మాట్లాడుతూ.. 39 ఏళ్ల మాత్రమే బ్రతికిన అలిశెట్టి సమాజ భావ దారిద్ర్యాలను అక్షర గన్‌తో పేల్చిన కవి అని కొనియాడారు. కవులు మువ్వా శ్రీనివాస్‌రావు, ప్రసేన, రచయితలు అట్లూరి వెంకటరమణ, కట్టా శ్రీనివాస్, విద్యావేత్తలు ఐవీ రమణ, రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న శృంగేరి శంకరమఠంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి పంచమ ఆరాధనోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో పంచరత్న గోష్టి, గాత్ర కచేరి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. నాదస్వర విదాంవన్ దర్గా సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల గాత్ర కచేరి నిపుణులు, వయోలిన్ విద్వాంసులు, మృదంగం ఆర్టిస్టులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి
వినోద	వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	వీరసింహారెడ్డి
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	వాల్తేరు వీరయ్య

- ఖమ్మంవ్యవసాయం

సహకారంలో నవశకం..

వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

- చైర్మన్లకు వేతనాలు.. సిబ్బందికి ఉద్యోగ భద్రత
- ఈనెల నుంచే అమలవుతున్న వైనం
- ఇక అభివృద్ధి దిశగా సహకార సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న సొసైటీ శ్రేణులు


బోదులబండ సొసైటీలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్న సీఈఓ నాగేశ్వరరావు(ఫైల్)


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సీఈఓలు(ఫైల్)

తక్కువ వేతనంతో నెట్టుకొస్తూ రైతుల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ల కల నెరవేరింది. చైర్మన్లకు గౌరవ వేతనం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక పీఏసీఎస్‌లో పని చేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. జనవరి నుంచి అమల్లోకి రావడంతో సహకారం సంఘాల్లో నవశకం మొదలైంది.

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని 10 సొసైటీలు నేలకొండపల్లి, పైనంపల్లి, రాజేశ్వరపురం, చెరువుమాధారం, చెన్నారం, బోదులబండ, మోటాపురం, నాచేపల్లి, రామచంద్రాపురం, మండ్రాజుపల్లి, కూసుమంచి మండలంలోని మూడు సొసైటీలు జక్కేపల్లి, కల్లూరిగూడెం, చేగొమ్మ, తిరుమలాయపాలెం మండలంలోని రెండు సొసైటీలు బీరోలు, తిరుమలాయపాలెం, రూరల్ మండలంలోని ఏదులాపురం సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో దాదాపు 50 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ప్రతీ సంఘంలో పనిచేసే సీఈఓ, క్లర్క్, స్టాఫ్ అసిస్టెంట్.. ఏళ్ల తరబడిగా విధులు నిర్వహిస్తూ.. సంఘాలకు సమకూర్చే రూ.కోట్ల ఆదాయంలో వీరి పాత్ర కీలకంగా ఉంది. కానీ, ఉద్యోగ భద్రత లేదు. కనీసం వేతనం, సదుపాయాలు, కూడా కరువే. అయితే వీరికి హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తూ ప్రభుత్వం జీఓ 44ను జారీ చేసింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సాకారం కానుంది.

టర్నోవర్‌ను బట్టి చైర్మన్లకు వేతనాలు..

సంఘం స్థాయిని బట్టి వేతనాలు పెరగనున్నాయి. పాలేరు డివిజన్‌లో ఉన్న 16 సంఘాల్లో రెండు సంఘాలు మినహా.. దాదాపుగా సీ గ్రేడ్‌లోనే ఉన్నాయి. రైతులకు అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. మరో వైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలనూ నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణలో చైర్మన్‌తో పాటు ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. సంఘం కార్యకలాపాలు సాగించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తారు. అవసరమైన వారికి రుణాలు అందిస్తుంటారు.

చైర్మన్లకు అందే వేతనాలిలా..

టర్నోవర్ (రూ.కోట్లలో)	వేతనం (రూ.లలో)
5 కోట్లు కన్నా తక్కువైతే..	5,000
5-10 కోట్లు	7,500
10-15 కోట్లు	10,000
15-25 కోట్లు	12,500
25 కోట్లు	15,000

వ్యాపారం పెంచుకునేందుకు కృషి..



కర్షకుల అభివృద్ధికి పాటుపడుతున్న మాకు గౌరవమైన వేతనం అందించటం సంతోషకరం. టర్నోవర్‌ను అనుసరించి వేతనాలు ఉండటంతో వ్యాపా రం పెంచుకునేందుకు ఇది మంచి అవకాశం. సంఘం అభివృద్ధికి, రైతుల శ్రేయస్సుకు మరింత కృషి చేస్తాం.

– నాగుబండి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్, పైనంపల్లి సొసైటీ

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



ఏళ్ల తరబడి పని చేస్తున్న గుర్తింపు ఇవ్వలేదు. రాష్ట్ర సీఎం కేసీఆర్ మాకు గుర్తింపునిచ్చి ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. సంఘం అభివృద్ధి మరింత పెరిగేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం.

– ఏ.నాగేశ్వరరావు, సీఈఓల సంఘం అధ్యక్షుడు, నేలకొండపల్లి

అందరికీ ప్రయోజనం..



తెలంగాణ ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేస్తుంది. ఇటు చైర్మన్లకు, అటు సొసైటీ సీఈఓలకు గౌరవం కల్పించింది. దీని వలన రైతులకు ఇంకా సేవలు అందించే అవకాశం దొరుకుతుంది. సంఘాల ఆర్థిక పరిపుష్టితో అందరికి ప్రయోజనం కలుగుతుంది.

– అనంతు కాశయ్య, చైర్మన్ బోదులబండ, సొసైటీ

రోడ్డు విస్తరణ పనుల్లో ఉద్రిక్తత


యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నేలకొండపల్లి: జాతీయ రహదారి ఏమో కానీ తమను రోడ్డున పడేస్తున్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని పైనంపల్లిలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో హైవే అధికారులు మార్కింగ్ కంటే అదనంగా ఇళ్ల తొలగిస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు గురువారం పనులను అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఉసిరికాయల శ్రీను ఇంటికి తొలుత 323 చదరపు మీటర్లుగా మార్కింగ్ ఇచ్చి 486 చదరపు మీటర్ల వరకు మార్కింగ్‌కు యత్నించగా అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చాక తాను ఇంటిని పునర్మించుకుంటే, మళ్లీ మార్కింగ్ ఇవ్వడమేమిటని ప్రశ్నించారు.ఇదేమారి వెంకటకృష్ణయ్య, యడవల్లి సైదులు తదితరులు వాదనకు దిగగా తహసీల్దార్ చేరుకుని చర్చించారు. చివరకు మరోమారు సర్వే చేసి అంతటా ఒకే మార్కింగ్‌కు కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కూసుమంచి: అక్రమంగా అరెస్ట్ చేసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కూసుమంచిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. నాయకులు గోపె రవి, దాట్ల వీరస్వామి, పోకల వెంకన్న, పడిశాల మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ వద్ద మహిళ నిరసన

నేలకొండపల్లి: తనకు ఇచ్చిన డబుల్‌బెడ్రూం ఇల్లును ఖాళీ చేయాలని చూస్తున్నారని, తనకు అన్యాయం చేయొద్దని ఓ మహిళ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజేశ్వరపురంకు చెందిన యాకోబీ అనే మహిళకు గ్రామంలో డబుల్ బెడ్రూం ఇచ్చారు. కాగా, కొంత మంది గ్రామస్తులు ఆ ఇంట్లో ఉండటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో హౌజింగ్ అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. తాజాగా తహసీల్దార్ దారా ప్రసాద్ యాకోబీని పిలిపించి ఇంటిని ఖాళీ చేయాలని సూచించారని బాధితురాలు ఆరోపించారు. ఈమేరకు గురువారం తహసీల్ వద్ద నిరసనకు దిగారు. తాను అదె ఇంట్లో ఉంటున్నా.. కొంతమంది కావాలని తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. తనకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బైరవునిపల్లి భూములు పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ గురువారం పరిశీలించారు. చేపల పెంపకం, సబ్సిడీ, దాణా ఇతరత్రా విషయాలను అడిగి తెలుసుకున్నారు. 40 ఎకరాల్లో ఇటీవల చెరువు కుంటను చేసి సమిష్టిగా చేపల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్న లబ్ధిదారులను అభినందించారు. వీరికి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన రికార్డులను పరిశీలించాలని స్థానిక తహసీల్దార్ దారా ప్రసాద్‌ను ఆదేశించారు. ఆయన వెంట లబ్ధిదారుల ప్రతినిధులు పెద్దపాక వెంకటేశ్వరరావు, రామదాసు, వెంకటేశ్వర్లు, సత్యం తదితరులు పాల్గొన్నారు.


కుంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

పేద విద్యార్థినికి చేయూత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్‌కు చెందిన ఓ పేద విద్యార్థిని వేముల తేజస్విని డిగ్రీ చదువు కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం పూర్వపు అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు ఆధ్వర్యాన ఆర్థిక చేయూతనందించారు. ప్రైవేట్ కాలేజీలో ఏడాదికి అయ్యే ఫీజుల మొత్తం కలిపి రూ.16 వేలను గురువారం విద్యార్థినికి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బత్తుల బసవపున్నయ్య, సభ్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై రాస్తారోకో

నేలకొండపల్లి: ఈ నెల 1వ తేదీన బైక్‌పై వస్తున్న ముగ్గురిని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో బాధితులకు పరిహారం ఇవ్వాలని బీఎస్పీ ఆధ్వర్యాన రాస్తారాకో నిర్వహించారు. మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన బొడ్డు కిరణ్ అతని భార్య కవిత, కుమారుడు హర్షిత్ బైక్‌పై వస్తుండగా.. కోనాయిగూడెం సమీపంలో జాతీయ రహదారి పనులు చేస్తు న్న టిప్పర్ ఢీకొట్టగా..ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కానీ, నేటికి ఎవరి దగ్గర నుంచి పరిహారం అందలేదని గురువారం కూసుమంచి-నేలకొండపల్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని యాజమాన్యంతో మాట్లాడతామని చెప్పడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. బీఎస్పీ నాయకులు, బాధితులు, అనాసాగారం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కట్

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: ఖమ్మం నగరంలోని రోటరీనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సబ్‌స్టేషన్ పరిధిలోని రోటరీనగర్ డెయిరీ ఫీడర్ పరిధిలో గల రోటరీనగర్, ఇందిరానగర్, పోలీస్‌కాలనీ, వరదయ్యనగర్, మమతరోడ్డు, మైసమ్మ దేవాలయం వెనకవైపు కాలనీల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలం వీవీపాలెం సబ్ స్టేషన్ -1 పరిధిలో 11 కేవీ లైన్ల మరమ్మతుల దృష్ట్యా వీవీపాలెంలో ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.

'వర్సిటీ' ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్‌కుమార్, సుధాకర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, ఐవీ రమణారావు, రవి మారుతి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తిదాయకం

భారతీయ యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. స్వామి వివేకానంద జయంతిని గురువారం మండల కేంద్రాల్లోని విద్యాలయాలు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పలుచోట్ల వ్యాసరచన, చిత్రలేఖన, పెయింటింగ్ వంటి పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశారు. అంతేకాక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. – సాక్షినెట్‌వర్క్


ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


ఖమ్మంమామిళ్లగూడెం: పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మోదీ విధానాలపై ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

కూసుమంచి: కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మల్లేపల్లిలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల రైతులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ పరం చేశారని, రైతులను దివాళ తీయించారని అన్నారు. మోడీ విధానాలపై రైతులు ఐక్యంగా పోరాడాలని, ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించన్ను భారీ ట్రాక్టర్ల ర్యాలీలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శులు బిక్కసాని గంగాధర్, రచ్చా నర్సింహారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థినికి సీటు


విద్యార్థినిని సన్మానిస్తున్న డీఎస్‌సీడీఓ కాస్తాల సత్యనారాయణ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహంలో 2021-22 విద్యా సంవత్సరానికి అత్యధిక మార్కులు పొందిన ఎస్.నవ్య బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో డీఎస్‌సీడీఓ కాస్తాల సత్యనారాయణ హాజరై నవ్యను అభినందించి రూ.5వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏఎస్‌సీఈఓ శ్రీలత, వసతిగృహ సంక్షేమ అధికారిణి విజయ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఖమ్మంరూరల్/ఖమ్మంఅర్బన్: మండలాల్లోని పలు గ్రామాల్లో రేషన్ దుకాణాలను సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబు, ఫుడ్ కార్పొరేషన్ అధికారి రంగాప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్డుదారులకు ఈ పాస్ మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా డీలర్లు సమయపాలన పాటిస్తూ బియ్యం సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కూసుమంచి/ ఖమ్మంరూరల్: ఈనెల 18 నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్‌నాయక్, బెల్లం ఉమ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాల్లో కంటివెలుగుపై జరిగిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఉచిత కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ కిషోర్, డాక్టర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను..

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు బీసీలు భారీగా తరలిరావాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నగర బీసీ సెల్ అధ్యక్షుడు మేకల సుగుణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్యదర్శి కస్తూరి లక్ష్మీనారాయణ, నాయకులు జక్కుల లక్ష్మయ్య, కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన సమావేశంలో మండల ఇన్‌చార్జ్ ములుగు జెడ్పీచైర్మన్ కుసుమ జగదీష్ మాట్లాడుతూ.. జనసమీకరణకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధర్నాను..

తిరుమలాయపాలెం: బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్ రూ.5వేలకు పెంచాలని ఈ నెల 23న మండలకేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకుడు తిమ్మిడి హన్మంతరావు తెలిపారు. గురువారం మండలంలోని బచ్చోడులో బోదకాలు వ్యాధిగ్రస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పైలేరియా బాధితులు పసలాది వెంకటమ్మ, బూబమ్మ, పూలమ్మ, పిచ్చమ్మ, వీరమ్మ, మాణిక్యమ్మ, రాములమ్మ, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యురాలికి బెదిరింపులు

నేలకొండపల్లి: బైరవునిపల్లిలోని గంగా భవానీ స్వయం సహాయక సంఘం ప్రతినిధులు తనను అకారణంగా తొలిగించేందుకు బెదిరిస్తున్నారని సభ్యురాలు గుండపనేని కృష్ణవేణి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో గ్రామదీపికగా ఉన్న సమయంలో తనను అవినీతిపరురాలిగా అసత్య ప్రచారం చేశారని, ఇందులో ఐకేపీ అధికారులు ప్రమేయం ఉందని చెప్పారు. ప్రస్తుతం వారిపై న్యాయ పోరాటం చేస్తున్నందున్న సంఘంలో నుంచే తొలిగించాలని బలవంతపు సంతకాలు చేయమని కొంత మంది సభ్యులు తన ఇంటిపైకి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తనను వేధిస్తున్న వారిపై కలెక్టర్, ఐకేపీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: కూసుమంచిలోని ప్రగతి విద్యాలయంలో 1992వ సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులందరూ కలుసుకొని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో నాటి గురువులు కట్టా శేఖర్‌రావు, వీరభద్రం, కస్తూరి, రామకృష్ణ తదితరులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఆసిఫ్‌పాషా, నర్సింహారావు, కిరణ్, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, సునీత, అబేధా, అనిత, ఖాజాబీ, ప్రమీల పాల్గొన్నారు.

సంబరంగా సంక్రాంతి వేడుకలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాలల్లోని విద్యార్థులు వివిధ వేషధారణల్లో రాగా భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. – సాక్షి నెట్‌వర్క్


హార్వెస్ట్ పాఠశాలలో భోగి మంట వేస్తున్న ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి


ఖమ్మం సహకారనగర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు


తెలంగాణ నారాయణ స్కూల్‌లో భోగి మంటను వెలిగిస్తున్న దృశ్యం


రెజొనెన్స్ శ్రీనగర్‌లో విద్యార్థులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదిస్తున్న డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి


రెజొనెన్స్ ఎస్‌వీఎంలో భోగి మంట వేస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ


న్యూవిజన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం


51వ డివిజన్‌లో ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందిస్తున్న కార్పొరేటర్ రమావీరభద్రం